# అన్నమయ్య సంకీర్తనలపై దివ్యప్రబంధ ప్రభావం



డా. యస్. ఏ. టి. రాజ్యలక్ష్మి

# అన్నమాచార్య సంకీర్తనలపై నాలాయిర దివ్య ప్రబంధ ప్రభావం

డా. ఎస్.ఏ.టి. రాజ్యలక్ష్మి

**అన్నమాచార్య సంకీర్తనలపై నాలాయిర దివ్య ప్రబంధ ప్రభావం**

పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం

**ANNAMĀCHĀRYA SAMKEERTANALAPAI NĀLĀYIRA DIVYA PRABANDHA PRABHĀVAM**

*Ph.D. Thesis*


**డా. ఎస్.ఏ.టి. రాజ్యలక్ష్మి**

**By: Dr. S.A.T. Rajyalakshmi**



ప్రథమ ముద్రణ : ఆగస్టు 2011

First Edition : August 2011

ప్రతులు : 1100

Copies : 1100

వెల : **118/-**

Price : **118 /-**

ముద్రణ : ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, హైదరాబాద్.

Printed At : Akruthi Printers, Hyderabad.



© సర్వహక్కులు రచయిత్రివి

All Rights Reserved



ఈ పుస్తకం భారతీయ భాషల సంస్థ మరియు కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి సంస్థ, మానస గంగోత్రి, మైసూరు వారి ఆర్థిక సహాయంతో ముద్రించబడినది. అనుమతి ఉత్తర్వుల నెం.ఎఫ్. 51-11(4) 2010-11, తెలుగు అనుమతి పొందిన తేది 10 మే, 2011.

This Book is published with financial assistance from the Central Institute of Indian Languages (Ministry of Human Resource Development of Higher Education, Govt. of India). Manasa Gangothri, Mysore - 570 006 vide sanction letter. No.F51-11 (4) 2010-11, TEL/GRNT dated 10 May 2011 under the scheme of Grant in Aid.



ప్రతులకు

డా. ఎస్.ఏ.టి. రాజ్యలక్ష్మి

# 104,

బాలాజీ విహార్, మారుతీ హిల్స్

బన్దమ్ కొమ్ము, అమీన్‌పూర్

మెదక్ జిల్లా - 502 032.

for copies

**Dr. S.A.T. Rajyalakshmi**

# 104,

Balaji Vihar, Maruthi Hills

Bandam Kommu, Ameenpur

Medak District - 502 032.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | | | పుట సంఖ్య |
| **ఉపక్రమణిక** | | | |
| | నా మాట | - | vii |
| | ఆశంస - ఆచార్య బేతవోలు రామబ్రహ్మం | - | ix |
| | అభినందన - ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి | - | xii |
| | ఆమోదం - కోవెల సుప్రసన్నాచార్య | - | xiii |
| | అభినందన - డా. శ్రీరంగాచార్య | - | xvi |
| | OVERTURE - Dr. S.N.C. Ramanujacharyulu | - | xviii |
| **1.** | **తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితం-కృతులు** | - | **1-13** |
| | 1.1 అన్నమాచార్యుల జీవితం | - | 2 |
| | 1.2 కృతులు | - | 8 |
| | 1.2.1 శృంగార, అధ్యాత్మ సంకీర్తనలు | - | 8 |
| | 1.2.2 శృంగార మంజరి | - | 9 |
| | 1.2.3 శతకాలు | - | 10 |
| | 1.2.4 అలభ్యకృతులు | - | 10 |
| | 1.3 అవసాన దశ | - | 10 |
| | పాదసూచికలు | - | 13 |
| **2.** | **ఆళ్వారుల పరిచయం - రచనలు** | - | **14-29** |
| | 2.1 ఆళ్వార్ శబ్ద నిర్వచనం | - | 14 |
| | 2.2 ద్వాదశాళ్వార్లు | - | 15 |
| | 2.2.1 పెరియాళ్వార్లు | - | 16 |
| | 2.2.2 ఆండాళ్ | - | 17 |
| | 2.2.3 కులశేఖరాళ్వార్లు | - | 18 |
| | 2.2.4 తిరుమళిశైయాళ్వార్లు | - | 19 |
| | 2.2.5 తొండరడిప్పొడియాళ్వార్లు | - | 20 |
| | 2.2.6 తిరుప్పాణాళ్వార్లు | - | 20 |

| | | | |
|---|---|---|---|
| 2.2.7 మధురకవియాళ్వార్లు | | - | 21 |
| 2.2.8 తిరుమంగైయాళ్వార్లు | | - | 22 |
| 2.2.9 పొయిగైయాళ్వార్లు | | - | 23 |
| 2.2.10 పూదత్తాళ్వార్లు | | - | 23 |
| 2.2.11 పేయాళ్వార్లు | | - | 24 |
| 2.2.12 నమ్మాళ్వార్లు | | - | 24 |
| 2.3 ఆళ్వారుల కాలం | | - | 25 |
| 2.4 రచనలు | | - | 25 |
| 2.5 ఆళ్వారుల పాశురాలు - తాత్త్వికత | | - | 28 |
| పాదసూచికలు | | - | 29 |
| **3.** | **అన్నమయ్య కాలంనాటి మత పరిస్థితులు** | **-** | **30-40** |
| | పాదసూచికలు | - | 40 |
| **4.** | **ఆళ్వారుల కాలంనాటి మత పరిస్థితులు** | **-** | **41-50** |
| | పాదసూచికలు | - | 50 |
| **5.** | **అన్నమాచార్య సంకీర్తనలపై నాలాయిర దివ్య ప్రబంధ ప్రభావం** | **-** | **51-217** |
| | 5.1 ప్రవేశిక | - | 51 |
| | 5.2 భక్తి వైభవం | - | 55 |
| | 5.3 భగవన్నామ సంకీర్తనం | - | 69 |
| | 5.4 ప్రపత్తి - శరణాగతి | - | 81 |
| | 5.5 ఆచార్య ప్రభావం | - | 103 |
| | 5.6 విశిష్టాద్వైతం | - | 113 |
| | 5.7 భాగవత సత్సంగ ప్రయోజనం | - | 124 |
| | 5.8 వైరాగ్యభావం | - | 138 |
| | 5.9 పరమాత్మ పంచ స్వరూపాలు - స్తుతివైభవం | - | 149 |
| | 5.10 లోకహితం | - | 159 |
| | 5.11 మధురభక్తి | - | 179 |
| | 5.12 కవితా సౌందర్యం - లోకజ్ఞత | - | 187 |
| | పాదసూచికలు | - | 204 |
| | ఉపసంహారం | - | 218-221 |
| | ఉపయుక్త గ్రంథసూచి | - | 222-228 |

# 1. తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితం - కృతులు

ఆధ్యాత్మిక చింతనకు నిలయమైన భారతదేశంలో విశ్వశ్రేయస్సును ఆకాంక్షిస్తూ ఎందరో మహానుభావులు తమ ప్రవచన సుధామాధురీ ఝురులతో ప్రజలను పునీతులను చేస్తూ తమ రచనలతో పరమాత్మతత్త్వాన్ని ప్రబోధించారు. కర్మ - భక్తి - జ్ఞాన యోగాలనే త్రివిధమార్గాల ద్వారా ఆధ్యాత్మిక పరమావధిని చేరుకొనే విధివిధానాలను మానవ జీవన విధానంతో మేళవించి సంప్రదాయాల రూపంలో అనుసంధానం చేశారు. అదే మనకు తరగని, అమూల్యమైన వారసత్వ సంపద.

ఈ నేపథ్యంలో భారతదేశ మంతటా భక్తిమార్గం విశేషంగా వ్యాప్తిచెంది ఒక ఉద్యమమై ఉవ్వెత్తున ఎగసింది. ఈ భక్తిమార్గ వ్యాప్తికోసం ఎందరో మహర్షులు, కావ్యకర్తలు, భక్తాగ్రేసరులు, సంగీతజ్ఞులైన వాగ్గేయకారులు ఎంతగానో కృషిచేశారు. అలా కృషిచేసిన వారిలో ఉత్తర భారతదేశంలో తులసీదాస్, కబీర్‌దాస్, మీరాబాయి, సూర్‌దాస్, లీలాశుకయోగి ప్రముఖులు. దక్షిణ భారతదేశంలో ఈ విధమైన కృషి చేసిన భక్తి ప్రబోధకులు తమిళదేశంలో ఆళ్వార్లు, తెలుగులో అన్నమయ్య మొదలైన వాగ్గేయకారులు, కన్నడ దేశంలో హరిదాసులు ప్రముఖులుగా నిలుస్తారు.

భారతదేశంలోని అనేక భాషలలో వెల్లి విరిసిన సాహిత్యంపై భక్తి ఉద్యమ ప్రభావం అధికం. తెలుగుసాహిత్యంలో ప్రత్యేకంగా మత ప్రచారం కోసమే అనేక ప్రక్రియలలో సాహిత్యం వెల్లి విరిసినది శివకవియుగంలో. ఇది ప్రత్యేకంగా వీరశైవ వ్యాప్తికే ఆవిర్భవించిన వాఙ్మయం. ఇందులో పదకవితలూ ఉన్నాయి. శివకవి యుగం క్రీ.శ. 12వ శతాబ్దిగా భావిస్తే, క్రీ.శ. 13వ శతాబ్దిలోని సింహగిరి నరహరి వచనాలు కూడా భక్తిమార్గాన్ని ఉద్బోధించే రచనలుగానే పరిగణించవచ్చు. పురాణానువాదాలు, భక్తి ప్రబోధాత్మక శతక రచనలు, క్షేత్రమాహాత్మ్య కావ్యాలు ఇవన్నీ ఈ కోవకి చెందినవే. తెలుగు సాహిత్యావిర్భావం నాటినుండీ భక్తి ప్రాధాన్యాన్ని ప్రస్ఫుటించేలా కవులు కావ్య నిర్మాణం చేశారు. ఈ పరంపరలోనే భగవద్రామానుజులు స్థాపించిన విశిష్టాద్వైత తత్త్వాన్ని అనుసరిస్తూ, వైష్ణవమత ధర్మాలను ప్రచారం చేయడంకోసం తన జీవితాన్ని అర్పించిన ధన్యజీవి, భక్తాగ్రేసరుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

## 1.1 అన్నమాచార్యుల జీవితం

'తాళ్ళపాక' గ్రామనామం, అదే తాళ్ళపాక కవుల వంశనామంగా మారి, ఆ గ్రామ ఖ్యాతి ఖండాంతరాలకు సైతం వ్యాపించిందంటే, దానికి తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనా సౌరభమే కారణం.

'పొత్తపినాడు' మండలంలో ఉన్న తాళ్ళపాక గ్రామంలో, చెన్నకేశవస్వామి కృపా కటాక్షవీక్షణాలు పుష్కలంగా ఉన్న పుణ్యక్షేత్రంలో అన్నమయ్య జన్మించాడు. అన్నమయ్య కాలం విషయంలో విమర్శకులలో రెండు అభిప్రాయాలున్నాయి. అన్నమాచార్య సంకీర్తనల రాగిరేకు మీద – "స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు 1346 అగునేటి క్రోధి సంవత్సర మందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు 1424 అగునేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 నిరుధానకు తిరువేంగళనాథుని మీదను అంకితము గాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన అధ్యాత్మ శృంగార సంకీర్తనలు" అన్న వాక్యాలను, అలాగే పెదతిరుమలాచార్యులు సంకీర్తనలను రచించిన కాలాన్ని తెలిపే రాగిరేకుల మీద – "శాలివాహన శక వరుషంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 మొదలుగాను తాళ్ళపాక అన్నమాచార్యులను దినమొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరునకు అంకితం చేసి చెప్పుమనఁగాను విన్నపము చేసిన సంకీర్తనలు" అన్న వాక్యాలను పరిశీలిస్తే – ఇవి వారి రచనాకాలాన్ని తెలిపేవే గానీ జనన కాలాన్ని ఉద్దేశించినవి కావు. అయితే ఈ వాక్యాల ఆధారంగా అన్నమాచార్యులు శాలివాహన శకం 1330 అంటే సర్వధారినామ సంవత్సర వైశాఖమాసం, విశాఖ నక్షత్రయుక్త పూర్ణిమాతిథి నాడు అనగా 9-5-1408న జన్మించినట్లు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, చాగంటి శేషయ్య ప్రభృతులు నిర్ధారించారు[1].

అన్నమయ్య నందవరీక వైదిక బ్రాహ్మణుడు. భారద్వాజసగోత్రుడు. ఆశ్వలాయన సూత్రుడు. ఋగ్వేది. లక్కమాంబ – నారాయణసూరుల పుత్రుడు. ఈ దంపతులు సంతానం లేకపోవడంవల్ల వేంకటేశుని దర్శించారు. అక్కడ వారికి స్వామి ఖడ్గమైన నందకం స్వప్నంలో సాక్షాత్కరిస్తుంది. తత్ప్రభావంవల్ల పుత్రుడు జన్మించగలడని గ్రహించిన వారిరువురు తాళ్ళపాకకు తిరిగివస్తారు. స్వామి అనుగ్రహంచేత –

"రాజీవనయను వరప్రసాదమునఁ
దేజంబు మతియు నెంతే విస్తరిల్ల
లక్కమాంబకుఁ బుణ్యలావణ్యవతికి
చక్కని గ్రహము లుచ్చమున మూఁడలర

అనుపమ లగ్నంబునందు వైశాఖ
మున విశాఖను జగంబున నుల్లసిల్ల
జనియించె నన్నమాచార్యుండు"[2]

నందకాంశతో పుత్రుడు జన్మించాడు. ఆ పుత్రునికి జాతకర్మలను యథావిధి నిర్వర్తించి అన్నమయ్య అని నామకరణం చేశారు.

ఆబాల్యభక్తుడైన అన్నమయ్య భక్త్యావేశంతో సుమధుర సంకీర్తనలతో స్వామిని కీర్తించేవాడు. తన 16వ ఏట నుండి రోజుకొక్క సంకీర్తనకు తక్కువ కాకుండా రచిస్తూ 32,000 సంకీర్తనల్ని స్వామికి అంకితం చేశాడు.

ప్రాపంచిక వ్యాపకాలు ఏ మాత్రం అన్నమయ్యను ఆకర్షించలేదు. ఒకసారి పచ్చిక కోసేందుకు వెళ్ళిన అన్నమయ్య తిరుమలకు ప్రయాణమయ్యాడు. తిరుపతి వెళ్ళే యాత్రికులతో కలిసి తిరుమలచేరి, అక్కడ ఉన్న దివ్యక్షేత్రాలన్నింటినీ దర్శించాడు. 'మోకాళ్ళ ముడుపు' వద్ద సాక్షాత్తూ అలమేల్మంగ సాక్షాత్కరించి, అనుగ్రహాన్ని ప్రసాదించడంతో ఆమెపై అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర శతకాన్ని రచించాడు. ఈ విషయాన్ని తాళ్ళపాక చిన్నన్న తన "శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల చరిత్ర" గ్రంథంలో పేర్కొన్నాడు[3].

అన్నమయ్య తిరుమలలో స్వామి పుష్కరిణిని, వరాహస్వామి దేవాలయాన్ని, శ్రీనివాసుని, భాష్యకారులను, నారసింహుని, జనార్ధనుని, అలమేలుమంగను, యాగశాలను, ఆనంద నిలయాన్ని, స్వామివారి కళ్యాణమండపాన్ని, గరుడాది వాహనాలను దర్శించాడు.

తిరుమలలో ఉన్న 'ఘనవిష్ణువ'నే వైష్ణవ యతి ద్వారా పంచసంస్కార దీక్షను పొంది శ్రీ వైష్ణవాన్ని స్వీకరించాడు. నాటి నుండి అన్నమయ్య అన్నమాచార్యుడయ్యాడు. వైష్ణవమత ప్రభావం, పరాకాష్ఠ చెందిన భక్తితో అనేకానేక కీర్తనలను రచించాడు.

తదుపరి స్వామి ఆదేశానుసారం తాళ్ళపాకకు చేరి, అక్కడ సంకీర్తనా యజ్ఞాన్ని కొనసాగించాడు. తాళ్ళపాకలో శ్రీహరి పరతత్త్వాన్ని గురించిన ప్రబోధాత్మకమైన సంకీర్తనలతో ప్రజలను చైతన్య పరిచేవాడు.

చిన్నతనంలోనే వైరాగ్యగీతాలు పాడుతున్న అన్నమయ్యను వివాహవిధిచేత చక్కదిద్దాలను కొన్నారు తల్లిదండ్రులు. తిరుమలమ్మ, అక్కలమ్మలను ఇచ్చి వివాహం చేశారు. అన్నమయ్య గృహస్థ ధర్మాన్ని నిర్వర్తిస్తూనే భగవంతుని సేవలో నిమగ్నమయ్యాడు. అహోబలంలోని శఠకోపయతి వద్ద విశిష్టాద్వైత వేదాంతాన్ని అధ్యయనం చేశాడు. అహోబల నృసింహునిపై కూడా అనేక సంకీర్తనల్ని రచించాడు. వివిధ వైష్ణవ క్షేత్రాలలో ఉన్న దివ్యమూర్తులను కూడా వేనోళ్ళ కీర్తిస్తూ, ప్రజలకు ఉద్బోధ చేస్తూ ఉంటే ప్రజలంతా అన్నమయ్యను అపరగంధర్వావ తారంగా కీర్తించేవారు. అతని గానామృతంలో ఓలలాడేవారు.

“హరిపూజ హరిసేవ హరికీర్తనంబు
హరినామము ధ్యాన మనిశంబుఁదనకు
ఘనతర సకల భోగంబులుగాఁగ
మనుచు వాల్మీకి రామాయణ మెల్ల
రాగంబుతో ననురాగంబుతోడ
బాగుగా గంధర్వు బాగుగాఁజదివి
పాటలన్నియు ఁదనపాట పిమ్మటన
పాటపాటనె పాటపాడి చూపఁగను”[4]

అని తాళ్ళపాక చిన్నన్న అన్నమయ్య గానవైశిష్ట్యాన్ని పేర్కొన్నాడు.

వాడవాడలా, ఊరూరా వ్యాపించిన అన్నమయ్య పేరు ప్రఖ్యాతులు టంగుటూరును పాలించే సాళువ నరసింహరాయలు విని, అన్నమయ్యను తన కొలువుకు ఆహ్వానించాడు. ఇతని పరిపాలన కాలం క్రీ.శ. 1486–1491. అన్నమయ్యకు సమవయస్కుడు. సాళువ వంశస్థులు కూడా సహజమైన వైష్ణవభక్తి కలవారైనందున అతని కోర్కెను మన్నించిన అన్నమయ్య అతని ఆహ్వానాన్ని మన్నించి టంగుటూరు చేరుకున్నాడు. అన్నమాచార్యుని ఆశీస్సులతో ఆ రాజు పెనుగొండకు అధిపతి అయ్యాడు. అన్నమయ్యను కూడా పెనుగొండకు రప్పించాడు. విష్ణుభక్తుడైన రాయలు హరి సంకీర్తనలను ఆలపించే అన్నమయ్య గానమాధుర్యాన్ని భక్తి పారవశ్యంతో ఎన్నోసార్లు విని తరించాడు.

ఒకసారి స్వామి సంకీర్తన ముగిసిన తరువాత, తనపై సంకీర్తన రచించి గానం చేయమని రాయలు కోరగా, అన్నమయ్య తిరస్కరించాడు. “ముకుందుని గొనియాడు నా జిహ్వ నిను గొనియాడంగ నేరదు” అని నిర్ద్వంద్వంగా చెప్పడంతో రాయలు ఆగ్రహోదగ్రుడై అన్నమయ్యను చెరసాలలో బంధించాడు. చివరికి స్వామి కృపవల్ల ఆ శృంఖలాలు వీడిపోయాయి. అప్పుడు రాయలు పశ్చాత్తాపంతో అన్నమయ్యను వేడుకొన్నాడు.

నిత్యం సంకీర్తనల్ని రచిస్తూ, స్వామిని అర్చిస్తూ, హరిభక్తులను సేవించాలని, భక్తులను అవమానించడం, భగవంతుని అవమానించడం కన్నా ఎక్కువ పాపమనీ ప్రజలకు ఉద్బోధిస్తూ, అనేకానేక దివ్యక్షేత్రాలలో వెలసిన మూర్తులపై అసంఖ్యాక సంకీర్తనల్ని రచించిన అన్నమయ్య వాక్కు సత్యమై భాసిల్లేది. అతని నోటి వెంట వచ్చిన మాట అక్షరాల జరిగేది.

వైష్ణవమత ప్రచారం, దివ్యక్షేత్ర సందర్శనాభిలాష అన్నమయ్యను వివిధ ప్రాంతాలలో సంచరింపజేసి ఆయా మూర్తులపై దివ్యమైన సంకీర్తనలను వెల్లడించేలా చేశాయి. రాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలలోని క్షేత్రాలను, గుంటూరు, నెల్లూరు జిల్లాలలోని దివ్యక్షేత్రాలను అన్నమయ్య దర్శించాడు. తిరుమల చుట్టూ ఉన్న తీర్థాలను

సందర్శించి, తిరుమల ఉత్సవ విషయాలనుకూడా విశేషంగా తన సంకీర్తనలలో ప్రస్తావించాడు, తిరుమల వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలలో జరిగే వాహన సేవను అన్నమయ్య ఇట్లా వర్ణించాడు:

"తిరువీథుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారముల తోడను

తిరుదండెలపై నేగీ దేవుడిదే తొలునాడు
సిరుల రెండవనాడు శేషుని మీదను
మురిపేన మూడోనాడు ముత్యాల పందిరి క్రింద
పొరి నాలుగోనాడు పువ్వుగోవిలలోను

గక్కున నయిదవనాడు గరుడుని మీదను
యెక్కెను ఆరవనాడు యేనుగు మీదను
చొక్కమై యేడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువ దేరును గుఱ్ఱ మెనిమిదోనాడు

కనకపు టందలము కదిసి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లి పీట
యెనసి శ్రీ వేంకటేశు డింతి యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాల మీదను"[5]

తిరుమల వేడుకలలో అన్నమాచార్యుడు పాల్గొనేవాడు. సుప్రభాతసేవ, ఏకాంతసేవ, కళ్యాణోత్సవం వంటి ఉత్సవాలలో పాల్గొన్నాడు. ఆయా అనుభూతుల్ని అక్షరబద్ధం గావించాడు. ఎన్నో క్షేత్ర విశేషాలను, సంస్కృతి విశేషాలను, సామాజికాంశాలను ఈ సందర్భంగా భావిలోకానికి అందించిన మహానుభావుడు అన్నమయ్య.

తమ సాహిత్యాన్నంతటినీ రాగిరేకులపై చెక్కించి, సంకీర్తన భాండాగారాన్ని ఏర్పరచిన ఘనత కూడా తాళ్ళపాక కవులదే. దీన్ని తిరుమల ఆలయ ప్రాంగణంలో 'తాళ్ళపాక అర' గా పిలుస్తున్నారు. ఇది ఏర్పాటు చేసిన నాటినుండి భాండాగారానికి నైవేద్యాదులు సమర్పించేవారు. తాళ్ళపాకవారి సాహిత్యాన్ని వెలుగులోనికి తెచ్చి, పరిష్కరించడానికి కృషిచేసిన పెద్దలు, పండితులలో సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, వి. విజయ రాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, ఏ.వి. శ్రీనివాసాచార్యులు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, కామిశెట్టి శ్రీనివాసులు ప్రముఖులు. తాళ్ళపాకవారి సాహిత్యాన్ని 1935 నుండి తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రచురించి సాహితీ లోకానికి అందుబాటులోనికి తీసుకువస్తూ, తాళ్ళపాక సాహిత్యంపై విశేషమైన కృషిని 'అన్నమాచార్య ప్రాజెక్టు' ద్వారా నిర్వహిస్తున్నారు.

సాహితీలోకంలో పదకవితా పితామహునిగా, హరికీర్తనాచార్యునిగా, పంచమాగమ సార్వభౌమునిగా కీర్తివహించిన తాళ్ళపాక అన్నమాచార్యులు ఇంతటి మహత్త్వపూర్ణమైన సాహిత్య సృష్టికి మూలపురుషుడు. తాను కృతి చెప్పడమేకాదు, తన వంశంలో ఎందరినో ప్రభావితం చేసి వారితో కవిత్వం చెప్పించాడు.

1. సుభద్రా కళ్యాణం రచించిన తాళ్ళపాక తిమ్మక్క (అన్నమయ్య మొదటి భార్య),
2. తాళ్ళపాక నరసింగన్న (అన్నమయ్య పెద్దకుమారుడు),
3. 'శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య', 'వేదాంతాచార్య', 'కవితార్కికకేసరి' ఇత్యాది బిరుదులు కలవాడు, శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలు, నీతిశతకం, చక్రవాళమంజరి, సుదర్శనరగడ, శృంగార దండకం, రేఫ – అకార నిర్ణయము, వేంకటేశ్వరోదాహరణము, వృత్తపద్య శతకము, వైరాగ్య వచన మాలికాగీతములు, భగవద్గీత (తెలుగు వచనము), హరివంశము, సంకీర్తన లక్షణ వ్యాఖ్య శ్రీ వేంకటేశ ప్రభాతస్తవం వంటి అనేక రచనలు చేసిన తాళ్ళపాక పెదతిరుమలయ్య (అన్నమయ్య రెండవ కుమారుడు),
4. శృంగారాధ్యాత్మ సంకీర్తనలు, అష్టభాషాదండకం, సంకీర్తన లక్షణం రచించిన తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు (పెదతిరుమలయ్య పెద్ద కుమారుడు),
5. తాళ్ళపాక అన్నయ్య (పెద తిరుమలాచార్యుని రెండవ కుమారుడు). సంగీత, సాహిత్య విశారదుడైన తాళ్ళపాక పెద తిరువేంగళనాథుడు (పెద తిరుమలయ్య పెద్ద కుమారుడు),
6. అన్నమాచార్య చరిత్ర (ద్విపద), పరమయోగి విలాసం (ద్విపద), అష్టమహిషీ కళ్యాణం (ద్విపద), ఉషాకళ్యాణం (ద్విపద) రచించిన తాళ్ళపాక చిన తిరువేంగళ నాథుడు (పెద తిరుమలయ్య నాల్గవ కుమారుడు, ఇతనికే చిన్నన్న అని పేరు),
7. కోనేటి తిరువేంగళనాథుడు (పెదతిరుమలాచార్యుని చిన్న కుమారుడు),
8. అమరుకం, గురుబాల ప్రబోధిక, సుధానిధి గ్రంథాలను రచించిన తాళ్ళపాక తిరువేంకటాచార్యుడు (తిరువేంగళప్ప),
9. శకుంతలా పరిణయం, శ్రీపాద రేణుమాహాత్మ్యం గ్రంథాలను రచించిన రేవణూరి వేంకటార్యుడు (అన్నమయ్య దౌహిత్రుడు) మొ॥వారు తాళ్ళపాక వంశంలో పండిత కవులైన వారిలో ప్రముఖులు.

అన్నమయ్య సమకాలీన సాహిత్య చరిత్రలో ప్రబంధయుగం విశిష్టమైన స్థానంలో ఉంది. అష్టాదశ వర్ణనలు గల చమత్కారవంతమైన రచనలు, వ్యంగ్య ప్రాధాన్యం, గుణ రసాలంకారాది ప్రాధాన్యం గల రచనలు వెలువడుతున్న కాలంలో ఆ ప్రవాహాన్ని లెక్కచేయక ఎదురీది పద కవిత్వాన్ని ఉద్ధరించాడు అన్నమయ్య.

సాహిత్యంలో ఇలా విశిష్ట మార్గాన్ని అనుసరించినట్లే, నాటి సమాజంలో మహమ్మదీయుల దండయాత్రల ప్రాబల్యం వల్ల ఛిన్నభిన్నమైన మత వ్యవస్థను కూడా ఉద్ధరించాలని దీక్షబూనాడు. తాను నమ్మిన వైష్ణవమత సిద్ధాంతాన్ని ప్రజలలో వ్యాప్తి గావించడంకోసం, ప్రజల భాషలోనే కీర్తనలల్లి తన ఆశయ సాధనకోసం పాటుపడ్డాడు.

అన్నమయ్య వైష్ణవమత ప్రచారం కావించినంత మాత్రం చేత కేవలం భక్తిస్తోత్రాదులతో రచనలు చేసినవాడు కాదు. నాటి సాహిత్య సంప్రదాయాలు, కవిత్వపు పోహళింపులు, అభివ్యక్తి చమత్కారాలు, సకలశాస్త్రాలు, వేదవేదాంగాది విద్యలు సమగ్రంగా తెలిసినవాడు కాబట్టి తన సంకీర్తనలకు కవితా సౌందర్యం అద్ది, మత ప్రచారాన్ని మరింత సౌందర్యవంతం చేశాడు. అలాగే సంగీతం విషయంలో కూడా కేవలం సంగీత శాస్త్రంలో రాటుదేలిన వారికి మాత్రమే అర్థమయ్యే రచనలు చేయలేదు. తన సంకీర్తనల్లో ఎన్నో జానపద సరణులకు అధిక ప్రాధాన్యాన్నిచ్చాడు.

> "నానావిధ దేశంబుల
> నానాకవి బుద్ధి వర్ణనా రచనలచే
> మానిత తానక రాగము
> తోనలరున్ దేశిపదము దొరలకు మెచ్చై"[6]

అని దేశికవితా ప్రక్రియకు ప్రాధాన్యాన్నిచ్చాడు. తన సంకీర్తనల్లో సువ్వి, మేలుకొలుపు గొబ్బి, జాజర, అల్లోనేరేళ్ళు, సోది, తుమ్మెద, చిలక, తందానలు, ఏల, కోలాటం, చందమామ, శోభనం, హారతి, నివాళి, ధవళ, ఉయ్యాల, లాలి, జోల, మంగళ, సాసముఖాలు, కూగూగులు, తాత్త్వికాలు, చాంగుబళాలు వంటి సరణులను అనుసరించాడు.

జన సామాన్యానికి తన పాట అందుబాటులో ఉండాలి. ఇది అన్నమయ్య ప్రధాన ఆశయం. అందుకే గ్రామ్యానికి కూడా తన సంకీర్తనల్లో స్థానం కల్పించాడు. అలాగని పండితుల్ని విస్మరించలేదు. సంస్కృత సంకీర్తనలు కూడా అనేకం రచించాడు. శిష్టవ్యవహారం, వ్యావహారిక భాష, గ్రాంథికభాష అన్నమయ్య రచనలలో సమానంగా ప్రాతినిధ్యాన్ని వహించాయని చెప్పవచ్చు.

నాటి వ్యవహారంలో ఉన్న ఎన్నో పలుకుబడులు, జాతీయాలు, నానుడులు అన్నమయ్య రచనల్లో అధిక ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నాయి. నేటికి ఎన్నో అన్నమయ్య ప్రయోగాలకు కచ్చితమైన అర్థాలు లభించడంలేదు. దీనికి నాటి జనవ్యవహారంలో ఉన్న ప్రయోగాలను ఉపయోగించడమే కారణం. నాటి ప్రాంతాలవారీగా, మాండలిక లక్షణాలతో ప్రసిద్ధంగా వ్యవహారంలో ఉన్న పదప్రయోగాలు మిగిలిన గ్రంథాలలో, కావ్యాలలో ప్రయోగించబడకపోవడం వల్ల, వ్యవహారంలో అంతగా ప్రాచుర్యంలోనికి రాకపోవడంవల్ల అవి అర్థం కాకుండా మిగిలిపోయాయి. వీటిని పరిశీలించి, పరిశోధించి, సందర్భానికి తగిన ప్రాయోగికార్థాలను

తెలియజెప్పినట్లయితే అన్నమయ్య కాలంనాటి సామాజికాంశాలు ఇంకా వెలుగులోనికి వస్తాయి. (ఈ దిశగా తి.తి.దే.వారు విశేషమైన కృషిచేస్తున్నారు).

## 1.2 కృతులు

ఆంధ్రసాహిత్య చరిత్రలో పదకవిత్వానికి పట్టంకట్టి, పదకవిత స్థానాన్ని సుస్థిరం చేసి, పదకవితా పితామహునిగా ఖ్యాతిని పొందిన తాళ్ళపాక అన్నమాచార్యుని కృతులను గురించి తాళ్ళపాక చిన్నన్న తన 'అన్నమాచార్యుని చరిత్ర' గ్రంథంలో ఈ విధంగా ప్రస్తావించాడు.

"యోగమార్గంబున నొక కొన్ని బుధులు
రాగిల్ల శృంగార రసరీతి ఁగొన్ని
వైరాగ్య రచనతో వాసింప గొన్ని
సారసనేత్రుపై సంకీర్తనములు
సరసత్వమున ఁదాళ సముఖముల్ గాఁగ
పరమ తంత్రములు ముప్పది రెండు వేలు
ప్రవిమల ద్విపద ప్రబంధ రూపమున
నవముగా రామాయణము, దివ్య భాష
నా వేంకటాద్రి మాహాత్మ్య మంతయును
గావించి, రుచుల శృంగార మంజరియు
శతకముల్ పదిరెండు సకల భాషలను
ప్రతిలేని నానా ప్రబంధముల్ చేసి"[7]

దీనిని బట్టి అన్నమయ్య 32,000 సంకీర్తనలు, శృంగార మంజరి, శ్రీ వేంకటేశ్వర శతకం, ద్విపద రామాయణం, వేంకటాద్రి మాహాత్మ్యం (సంస్కృతం), ఇంకా పదకొండు శతకాలు రచించినట్లు తెలుస్తోంది.

### 1.2.1 శృంగార, అధ్యాత్మ సంకీర్తనలు

అన్నమయ్య రచించినట్లు తెలుస్తున్న 32,000 సంకీర్తనలలో ప్రస్తుతం 14,000 దాకా లభిస్తున్నాయి. వీటిలో శృంగారరస ప్రధానమైనవే ఎక్కువ. భగవంతుని స్వరూపాన్ని, భక్తితత్త్వాన్ని, వైష్ణవ మత సిద్ధాంతాలని, విశిష్టాద్వైత తత్త్వలక్షణాలని, నవవిధభక్తి మార్గాలను, పరతత్త్వాన్ని తన సంకీర్తనలలో పొందుపరిచాడు.

తమిళంలో పన్నిద్దరాళ్వార్లు రచించిన 'నాలాయిర దివ్య ప్రబంధా'న్ని అనుసంధానం చేసిన అన్నమయ్యపై ఆ రచనల ప్రభావం అధికంగా ఉంది. రామానుజాచార్యుల దివ్యమార్గమే అన్నమయ్యకు అనుసరణీయమైంది. విశిష్టాద్వైతంలో విశిష్టమైన శరణాగతి, ప్రపత్తి, శ్రీప్రాధాన్యం,

దాసత్వం వంటివన్నీ అన్నమయ్య సంకీర్తనల్లో ప్రముఖ పాత్ర వహించాయి. ఎంతో ప్రభావాన్ని చూపాయి.

వేదప్రామాణ్యాన్ని, పరతత్త్వాన్ని, దేహి – దేహ సంబంధాన్ని, మాయాతత్త్వాన్ని అనేక విధాలుగా అన్నమయ్య కీర్తించాడు. శ్రీహరి పదారవిందాసక్తచిత్తుడై సంకీర్తనల్ని విరచించిన అన్నమయ్య సంకీర్తనలు –

"పావనములు హరిభక్తి వి
భావనములు సర్వమంత్ర పరమ రహస్యో
ద్భావనములు గాయక నిక
రావనములు తాళ్ళపాకయన్నయ పదముల్"[8]

నిష్కామకర్మతో, ఐహికాసక్తిని విడనాడి పారమార్థిక చింతనను అలవర్చుకొని శాంతి కళ్యాణాలను పొందాలని అన్నమయ్య హితవు పలికాడు.

నవవిధ భక్తులలో మధురభక్తి విశిష్టమైనది. భాగవతంలో రాధ, గోపికలు, అలాగే మీరాబాయి ఈ భక్తి మార్గంలో స్వామిని సేవించి తరించినవారు. గోదాదేవి కూడా మధురభక్తి ద్వారానే స్వామిని పొందింది. వైష్ణవంలో 'ఈ సృష్టి మొత్తం స్త్రీస్వరూపమే. విష్ణువు ఒక్కడే పురుషుడు' అనే సంప్రదాయం ఉంది. ఈ సంప్రదాయాన్ని అనుసరించే గోపికలు శ్రీకృష్ణునికై తపించినట్లు భాగవతంలో వర్ణించ బడింది. ప్రతిభక్తుడూ తనను తాను స్త్రీగా భావించి, పురుషుడైన విష్ణు సాంగత్యాన్ని ఆకాంక్షిస్తాడు. జీవాత్మ – పరమాత్మ సంబంధం కూడా ఇటువంటిదే.

శృంగార సంకీర్తనలకు పీఠికను సంతరించిన గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు "సామాన్య జనులు తత్త్వదృష్టితో దైవమును చూచి కొలచి తరించుట వలనుగాని పని. వారివారి అనుభవములకు తగిన శృంగార లీలలనైతే మధురముగా చేపట్టి పాడుకొనగలరు. అందుకనియే శృంగార దృష్టితోనైన వేంకటేశ్వర నామాంకిత కీర్తన సాగించి కృతార్థులగుదురుగాక!"[9] అని అన్నమయ్య శృంగార సంకీర్తనలు రచించడానికి కారణాన్ని వివరించారు.

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో అష్టవిధ నాయికాభేదాలు, సంభోగ విప్రలంభ శృంగారాలు, అలౌకిక శృంగారం, పారమార్థికత, చేష్టలు, జానపదుల హావభావ విన్యాసాలు రసోపేతంగా అలరారాయి.

### 1.2.2 శృంగార మంజరి

అన్నమాచార్యులు సాళువ నరసింహరాయల ఆశ్రయాన్ని విడిచిపెట్టిన తర్వాత తిరుమలకు వెళ్లి 'శృంగార మంజరి'ని రచించి స్వామికి సమర్పించాడు. అన్నమయ్య రచించిన లభ్యలఘుకృతులలో ఇది ఒకటి. 517 పంక్తులు కల ఇది మంజరీ ద్విపదకావ్యం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Annamacharya+Samkeertanala+pai+Naalayira+Divya+Prabandha+Prabhaavam**

* * *